# ఆగామి వసంతం

ప్రమీల లేని ఓపిక తెచ్చుకుని పాఠం చెబుతున్నది. ఏడవ క్లాసు. పేరుకు ఏదైనా ఆ పాఠాలు చెప్పాలంటే తప్పనిసరిగా చదువుకుని రావాలి.

మరి ఇది కంప్యూటర్ యుగం. తను డిగ్రీలో చదివినవి ఇప్పుడు స్కూల్లో టెన్త్‌లోపే పాఠ్యాంశాలుగా మారిపోతున్నాయి.

నిజం చెప్పాలంటే తను డిగ్రీ పూర్తి చేసిన డబ్బులతో ఇప్పుడు యల్‌కెజి క్లాసు కూడా పూర్తి కాదు. స్టాండర్డ్ పెరగడం ఎలా ఉన్నా చదువుకునే వాళ్ళకు చదువు కొనుక్కోవడం తప్పనిసరి. తమ కాలంలో చదువుకున్నారు. ఈ కాలంలో చదువు కొంటున్నారు.

అస్సలు ప్రమీల సెలవు కోసం ప్రయత్నించింది. కాని హెచ్.ఎం. కరుణామయి పేరుకు తగినట్లు చాలా నిర్దయురాలు. చాలామంది 'శాడిస్టు' అని పిలుస్తారు. ప్రమీలకు స్కూలు ఇల్లు తప్పించి మిగతా విషయాలు పట్టవు కాబట్టి వాటి గురించి ఆలోచించదు. తన లీజర్ టైములో కూడా పుస్తకాలు తిరగవేస్తూ ఉంటుంది.

ఆరోగ్యం బాగా లేకపోయినా సెలవు కావాలంటే స్కూలుకు వచ్చి హెచ్.ఎం. గారికి కనిపించి సెలవు చీటీ రాసి – శాంక్షన్ చేయించుకుని వెళ్ళాలి.

కొత్తగా చేరిన ప్రమీలకు ఈ రూల్సు గురించి పెద్దగా తెలీదు. ఒకసారి ఇంటి విషయంలో అత్యవసరమైన ఒక పిల్లవాడితో సెలవు చీటీ పంపించి స్కూలుకు రావడం మానేసింది. అంతే! ఆ మరుసటి రోజు కరుణామయి ఎంత క్లాసు తీసుకుంది. ఎన్ని తిట్లు తిట్టింది. ఇప్పటికీ తను మర్చిపోలేదు.

అందుకే ఈ రోజు జ్వరంగా ఉంది సెలవు కావాలని అడగడానికి వచ్చింది. ఉదయం జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

'మేడమ్! నాకు ఫీవర్‌గా ఉంది. ఈ రోజు సిఎల్ కావాలి!' చాలా వినయంగా – జంకుతూ అడిగింది.

నోట్సులు పరిశీలిస్తున్న హెచ్.ఎం. సీరియస్‌గా చూపింది ఆమె వంక.

ప్రమీలకు కాళ్ళు వొణికాయి. అయినా తప్పదు కాబట్టి మళ్ళీ అడిగింది.

'సారీ ! మేడమ్ ! నా హెల్త్ బాగోలేదు. ఐ వాంట్ వన్‌డే లీవ్.'

'సీ ప్రమీల! నువ్వు చేరినప్పటి నుంచీ గమనిస్తున్నాను. స్కూలు ఎగ్గొట్టడానికి ఏ కారణం దొరుకుతుందాని ఎప్పుడూ వెతుకుతూ ఉంటావు' కఠినంగా అంది కరుణామయి.

'అదేం కాదు మేడమ్! అస్సలు నాకు ఇంట్లో తోచదు. ఎంతో అత్యవసరమైతే

తప్పించి నేను అడగను' సంజాయిషీగా చెప్పింది ప్రమీల.

'అది కూడా చాలామంది సెలవు పెట్టినప్పుడే అడుగుతావు- ఇవ్వాళ నలుగురు టీచర్లు సెలవులపై వెళ్ళారు. గో అండ్ టేక్ యువర్‌క్లాసెస్' కరుగ్గా అంది.

'బట్ - నాకు అస్సలు బాగోలేదు' జాలిగా అడిగింది.

'ప్రమీలా ! లక్షలు - కోట్లు పెట్టి బిల్డింగ్స్ కట్టించి ఇంత మంది పిల్లలను చేర్చుకుని, టీచర్లకు మాటిమాటికి సెలవులిస్తూ వాళ్ళను బదుద్దాయిలను చేద్దామనా?' కోపంగా అడిగింది.

'మీరు చూశారుగా మేడమ్ ! నాకున్న లీజర్ అవర్స్‌లో కూడా నేను మిగతా వాళ్ళు అడిగితే క్లాసులు తీసుకుంటూ ఉంటాను. మీరు హాలిడేస్‌లో - ఆదివారాల్లో ఎక్స్‌ట్రా క్లాసులు పెట్టినా వస్తూ ఉంటాను. జస్ట్ నాకు అస్సలు బాగోలేదు కాబట్టి అడుగుతున్నాను.' బహుశా జీవితంలో ఆమె ఎవరి ముందు నిల్చుని అంతగా ఇంత వరకూ దేబిరించి ఉండదు. తన దురవస్థకు తన్ను తాను నిందించుకుంది.

'సారీ ! ఇవ్వాళ ఎటువంటి పరిస్థితుల్లోనూ లీవు ఇవ్వలేను. అంతగా కావాలంటే పర్మినెంట్ లీవ్ తీసుకో' ఇంకో మాటకు అవకాశం ఇవ్వకుండా చరచర వెళ్ళిపోయింది హెచ్.ఎం. కరుణామయి.

ప్రమీల నిశ్చేష్టురాలైంది.

ఆమె ఇంతవరకు ఎన్నో స్కూళ్లల్లో పనిచేసింది. కాని ఇంత కఠినాత్మురాల్ని ఎక్కడా చూడలేదు.

కాస్త జీతం పెరుగుతుందని పాతస్కూలు వదులుకుని దీంట్లో చేరడం తనదే బుద్ధి తక్కువ.

కాని ఐదేళ్ళు అక్కడ పనిచేసినా జీతం పదిహేను వందలు దాటలేదు. ఇక్కడ అనుభవం ఉన్నవాళ్ళకు రెండువేలు అని చెబితే చేరింది.

కాని మనుషుల్ని పిండటం అంటే ఏమిటో ఈ స్కూల్లో తెల్సింది. పేరుకు స్కూలు ఆరుగంటలైనా ఎనిమిది గంటలు స్కూల్లో గడపాల్సి వస్తుంది. ఆపైన నోట్సులు ముందుగా రాసి కరుణామయి గారి అప్రూవల్ తీసుకోవాలి. ఆ నోట్సులు ఒక పట్టాన అప్రూవ్ చేయదు ఆ మహాతల్లి. కొన్ని కొట్టివేస్తుంది. కొన్ని తిరగరాయిస్తుంది. కొన్నిటిని విమర్శిస్తుంది. ఏతావాతా టీచింగులు కాని - నోట్సుల విషయంలో గాని పిసరంత స్వాతంత్ర్యం కూడా ఇవ్వదు.

అంటే సెలవు కావాలంటే తను ఉద్యోగం మానెయ్యాలి. ఉద్యోగం లేందే ఇల్లు గడవదు. తన శ్రీవారికి సరియైన ఉద్యోగం లేదు. చిన్న చిన్న ఎలక్ట్రికల్ పనులు చేస్తూ

కూసింత సంపాదిస్తున్నాడు. ఏదో చన్నీళ్లకు వేణ్ణీళ్లు లాగా తనూ, పెళ్ళయినా కూడా, చేస్తున్న చిరుద్యోగం మానకుండా సంసారాన్ని లాగిస్తున్నది.

ఉన్నపళంగా ఉద్యోగం మానుకుంటే వచ్చే ముష్టిజీతం కూడా రాదు. గడవాలంటే భయమేస్తుంది. ఫస్టు వచ్చేసరికి తిన్నా తినకపోయినా పస్తులున్నా అద్దె వెయ్యి రూపాయలు కట్టాల్సిందే. లేకపోతే బజారులో పడాల్సి వస్తుంది. పాలవాడు పాలలో ఎక్కువశాతం నీళ్లు కలిపి పోసినా వాడి డబ్బులు వాడి మొహాన పడేయాల్సిందే.

పిల్లల స్కూలు ఫీజులు కట్టాల్సిందే. అడపాదడపా జబ్బులు వస్తూ ఉంటే డాక్టర్‌కు చూపించి ఫీజులు, మందులకు డబ్బులు వదిలించుకోవాల్సిందే.

ఇంకా ఎంత పిసినారిగా తిన్నా బియ్యం చౌకడిపోల్లో అయినా కొనుక్కోవాలి. కూరలకు, దినసరి వెచ్చాలకు కిరాణా కొట్లో చెల్లించాల్సిందే.

తను ఉద్యోగం మానేస్తే – ఇవన్నీ ఆగవు. శ్రీవారిపైన వత్తిడి పెరుగుతుంది. ఇప్పటికే సంసారం నిస్సారంగా ఉంటున్నది – ఇది కూడా మానుకుంటే విరక్తి పెరుగుతుంది.

అందుకని ఆమె ఒంట్లో ఓపిక లేకపోయినా ఓ మందు బిళ్ల మింగి క్లాసులు తీసుకుందామనే నిశ్చయించుకుంది. కాకపోతే 'దేవుడా నేనేం పాపం చేశాను– నాకు ఎందుకు ఇటువంటి శిక్షలు విధిస్తున్నావు' అని మనసులో ఆక్రోశించింది. ఎద్దుపుండు కాకికి ఏం ముద్దు?

మూడో పీరియడు అవుతుండగా ప్రమీలకు కాస్త కళ్ళు తిరిగినట్లయింది. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి.

క్లాసులో వున్న కుర్చీలో కూలబడింది– ఏదీ పాఠం మీరు చదవండి అంటూ.

ఓ రెండు నిమిషాలు అలా కూర్చుందో లేదో – రౌండ్స్ కొడుతున్న కరుణామయి కళ్లల్లో ఆమె పడనే పడింది. ఆమె కళ్లు చింతనిప్పులయ్యాయి.

'ప్రమీలా ! పాఠం చెప్పే తీరు అదేనా! నువ్వు కుర్చీలో కూర్చుని చెబుతూంటే వాళ్ళకేం అర్థం అవుతుంది? క్లాసులో తిరుగుతూ – బోర్డు మీద రాస్తూ చెప్పాలని తెలియదా?' గర్జించింది.

' సారీ ! ఇప్పుడే కాళ్లు పీకుతూంటే కూర్చున్నా!' తడబడుతూ లేచి నిల్చుంది ప్రమీల.

' అంతా దొంగలు! కాస్త చూడకపోతే కళ్లల్లో కారం కొడతారు. ఇది మొదటి తప్పుగా భావించి క్షమిస్తున్నాను' చాలా ఉదారస్వభావురాల్లాగ చెప్పింది కరుణామయి.

ఆ తర్వాత ప్రమీల ఊహించనిది జరిగింది.

ఎడమకాలెత్తి ఆ కుర్చీని ఒక తన్ను తన్నింది. పాపం బక్కచిక్కిన కుర్చీ ఎగిరి

వరండాలో పడింది పల్టీలు కొడుతూ.

బసులు కొడుతూ కరుణామయి బయటకు వెళ్ళింది ప్రమీలను ఓరకంట చూసి.

ప్రమీల స్టన్నయింది. తన గుండెల మీద తన్నినట్లు బాధపడింది. ఏంటి తను చేసిన తప్పు.

పిల్లలకు బెంచీలు బల్లలున్నాయి. వాళ్లు కూర్చుని వింటున్నారు, రాసు కుంటున్నారు. టీచర్లకు కుర్చీలు వేశారు అలంకార ప్రాయంగా - కాని తాము కూర్చోకూడదా?

ఏ టీచరు అదే పనిగా కూర్చుని చెప్పదు - కాని కాస్త ఊపిరి పీల్చుకోవడం కోసం కూర్చోవడం తప్పా? నోట్స్ డిక్టేట్ చేస్తున్నప్పుడు కూర్చోవడం తప్పా?

తాము పి.జి. చేసినా ఇంటర్ అత్తెసరు మార్కులతో పాసైన యాజమాన్యం కింద పనిచేయడం తప్పా? మిడిమిడి జ్ఞానం కల్గిన హెచ్.ఎం. కింద పనిచేయడం తప్పా? యాజమాన్యానికి - హెచ్.ఎం.కు ప్రైవేట్ మేనేజ్ మెంట్‌లో తేడా ఉండదు పెద్దగా.

ఆ రోజల్లా ప్రమీల ఒంట్లోంచి వణుకు వస్తూనే ఉంది. మొహం పాలిపోయి - కాళ్లు చేతులు వేలాడేసుకుంటూ ఇల్లు చేరింది. శారీరక బాధకంటే మానసిక బాధ ఎక్కువైంది.

' ఏం ప్రమీలా ! అలా ఉన్నావు' ఇంట్లో ఎదురుచూస్తున్న సుదర్శనం అడిగాడు.

ప్రమీల నోట్లోంచి మాట రాలేదు కాని - కళ్లల్లోంచి కన్నీళ్లు వచ్చాయి. మంచం మీద వాలిపోయింది- తలగడలో మొహం దూర్చి.

' సారీ ! నిన్ను బాగా కష్టపెడుతున్నాను కదూ! అసమర్థుడిని పెళ్ళి చేసుకున్నావు- నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకునే వాడిని చేసుకుంటే ఇలా ఇంట్లో - స్కూల్లో గొడ్డు చాకిరి చేయాల్సిన అవసరం ఉండేది కాదు' భర్త సుదర్శనం ఓదార్పుగా అన్నాడు.

' ఏవండీ ! నాకు ఈ స్కూల్లో పని చేసే శక్తి లేదండి... అర్జంటుగా ఇంకెక్కడైనా ఉద్యోగం దొరుకుతుందేమో కొంచెం చూడండి' ఏడుస్తూ చెప్పింది ప్రమీల.

సుదర్శన్ మనసు కరిగిపోయింది.

' అస్సలేం జరిగింది ప్రమీలా! మన పెళ్లైనప్పటి నుండి నిన్ను ఇలా నేను ఎప్పుడూ చూడలేదు' బుజ్జగించాడు.

ప్రమీల ఏడుస్తూ అంతా చెప్పింది.

' ఏవండీ ! ఇంత అవమానం జరిగిన తరువాత పిల్లలకు మొహం ఎలా చూపించేదండి? కొంచెం జీతం తక్కువైనా ఇంకేదైనా స్కూల్లో జాబ్ దొరుకుతుందేమో

ప్రయత్నించండి' వాపోయింది.

సుదర్శన్ కాళ్ళకు బలపాలు కట్టుకుని ఊరంతా తిరిగాడు. అదృష్టం కొద్దీ మరుసటి రోజు ఆదివారం కావడంతో ప్రమీల స్కూలుకు పోవాల్సిన అవసరం ఏర్పడలేదు.

సుదర్శన్ దాదాపు ఓ మోస్తరుగా జీతాలు ఇస్తారు అని అనుకున్న స్కూళ్లన్నీ చుట్టి వచ్చాడు.

' సారీ ! ప్రమీల ! ఎక్కడా ఖాళీ లేదు – అకడమిక్ సంవత్సరం మధ్యలో వేకెన్సీ పడటం అరుదు. రేప్పొద్దున డిఎస్సీ సెలక్షన్స్ జరిగి ఎవరైనా సెలెక్ట్ అయి వెళితే పడవచ్చు. అప్పటిదాకా వేచి ఉండక తప్పదు – ఈలోగా ఆ స్కూల్లో మానుకుంటావేమో ఆలోచించుకో' నిస్సహాయంగా చెప్పాడు.

ఓ గంట తర్వాత ప్రమీల చెప్పింది. 'కానివ్వండి– మంచి ఉద్యోగం దొరికేదాకా అక్కడే చేస్తాను'.

' అదేంటి?' ఆశ్చర్యపోయాడు. 'అంత అవమానం పాలై మళ్ళీ ఆ రాక్షసి కింద పనిచేస్తావా?'

' తప్పదు అవసరం మనది... ఈమె అవమానం చేసిందని మానుకుంటే రేప్పొద్దున పదిమంది అవమానం చేస్తారు. ఇంటి అద్దె కట్టకపోయినా – పాలవాడికి డబ్బులు ఇవ్వకపోయినా – కిరాణాకొట్లో డబ్బులు చెల్లించకపోయినా– మెడికల్ షాపులో బిల్లు కట్టకపోయినా– పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక పోయినా– అందరి నోట్లో నానాలి– అంతకంటే ఒక్క హెచ్.ఎం. చేతిలో అవమానం పాలు కావడం మంచిది కదూ?' రాలుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ చెప్పింది ప్రమీల.

' ప్రమీలా ! పనిమనిషిని తిడితే వెంటనే పని మానేసి పారిపోతుంది. కూలీ పనివాడిని ఆక్షేపిస్తే వాడు పని మానేస్తాడు. రిక్షా వాడిని –ఆటో వాడిని తిట్టినా రేపటి నుండి పని మానేస్తానని బెదిరిస్తాడు. ఆఖరికి మన పిల్లల్ని తిట్టినా వాళ్లు హఠం చేసి మన చేత సారీ చెప్పిస్తారు. ఏ తప్పూ చేయకుండా మాటలు పడి – అవమానం పొందిన స్కూలు టీచరు – పిజిలు – పిహెచ్‌డిలు చేసిన స్కూలు టీచర్లు మటుకు వాళ్లకు జరుగుతున్న అన్యాయాలకు నోరు విప్పలేక పోతున్నారు? జ్ఞానం బోధించి అజ్ఞానం తొలగించాల్సిన గురువులు కొందరి స్వార్థపరులు– ధనమదాంధుల గుప్పిళ్ళలో ఇరుక్కు పోయి నలిగి కుంగిపోతున్నారు' ఏమీ చేయలేక తెగబాధపడిపోయాడు సుదర్శన్.

' చదువుకోని లేబరు మా చదువుతున్న టీచర్ల కంటే ఇంకా చిరుద్యోగాలు చేస్తున్న ఎడ్యుకేటెడ్ లేబరు కంటే చాలా ఎక్కువ సంపాదిస్తున్నారు. అంతే కాదు మాకు లేని స్వాతంత్ర్యం వాళ్ళకుంది. పనిలో రాజీ పడాల్సిన అవసరం వాళ్ళకు లేదు. ఈ

పొరపెచ్చులు, భేషజాలు వాళ్లకు లేవు. లక్షలు ఖర్చు పెట్టి డిగ్రీలు చేసి, గంజికి గతిలేక బ్రతకాల్సిన అవసరం వాళ్లకు లేదు. స్వాభిమానం దెబ్బతింటే ఊరుకోరు. తిరుగుబాటు చేస్తారు. అవసరం పడితే అవమానించిన వాళ్ళకు బుద్ధి చెబుతారు. కాని మాకు చదువు ఎక్కువైందిగా - అందుకే భూదేవిలాగా అన్నీ భరించి కృంగి కృశించి పోతున్నాము' ప్రమీల కళ్ల నీళ్లు పెట్టుకుంది.

'ప్రభుత్వం వెట్టి చాకిరీని నిషేదించింది. కార్మికులకు ఎనిమిది గంటలు పని నిర్ణయించింది. లేబరుకు కనీస వేతనం నిర్ణయించింది. కాని భావిపౌరులను తయారు చేస్తున్న పవిత్రమైన గురువులకు మటుకు గోరంత వెలుతురు చూపించలేక పోతున్నది' సుదర్శన్ బాధపడ్డాడు.

' వెలుతురు కోసం వెతకనంత కాలం చీకట్లో ఉండక తప్పదు. మాకూ ఒక యూనియన్ కావాలి. మా న్యాయమైన కోర్కెల కోసం పోరాడాలి! ఆ రోజు వస్తుందన్న ఆశతో - వల్లభాయ్ పటేల్ లాంటి నాయకుడు పుడతాడన్న ఆశతో - అవమాన గరళాన్ని శివుడిలా నా కంఠంలో నిలుపుకుంటూ లక్ష్యసిద్ధ కోసం ప్రయత్నిస్తూ బతుకుతాను' ప్రమీల ఆవేశం సుదర్శన్‌ను కదిలించి వేసింది. ఆగామి వసంతం కనిపించింది.

- ఆదివారం ఆంధ్రభూమి 30 -11-2003